# సాక్షి మంచిర్యాల

శనివారం ; 13 ; జనవరి ; 2024






## పతంగుల పండుగ షురూ..

సంక్రాంతి సెలవులతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పతంగులు ఎగురవేస్తున్నారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. 10లో▸



## యువతకు దిక్సూచి వివేకానంద

స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమలలు వేసి నివాళులర్పించారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /18.0

## వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### నిస్వార్థంగా ప్రజలకు సేవలందించాలి

- పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది
- సీపీ రెమా రాజేశ్వరి



పదోన్నతి పొందిన ఎస్సైలతో సీపీ

**మంచిర్యాలక్రైం:** పోలీస్ శాఖ ఉద్యోగులు నిస్వార్థంగా ప్రజలకు సేవలందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎనిమిది మంది ఎస్సైగా, పది మంది ఏఎస్సైగా, 19మంది హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. శుక్రవారం పదోన్నతి పొందిన ఉద్యోగులను అభినందిస్తూ పలు సూచనలు, సలహాలు అందించారు. పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందని, పోలీస్‌శాఖలో ఉద్యోగుల పనితీరు, క్రమశిక్షణను బట్టి ఉన్నత స్థానంలో ఉంచుతుందని అన్నారు. కష్టపడి పని చేస్తే గుర్తింపు అదే లభిస్తుందని, విధి నిర్వహణే లక్ష్యంగా పని చేస్తూ తమ ఆరోగ్యాన్ని సైతం కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.

### జిల్లా అధికారికి అవార్డు అభినందనీయం



రమేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ సంతోష్

**మంచిర్యాలఅగ్రికల్చర్:** వ్యవసాయ రంగంలో కృషిని గుర్తించి, తదుపరి ప్రయత్నాలను ప్రేరేపించడానికి వివిధ విభాగాల్లో ఏరువాక ఫౌండేషన్ అందించే ప్రతిష్టాత్మకమైన ఏరువాక వ్యవసాయ వార్షిక అవార్డులకు జిల్లా అధికారి ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో వార్షిక అవార్డుకు ఎంపికైన జిల్లా పశు వైద్య, సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వై.రమేష్‌కుమార్‌కు మొక్కలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్న వ్యవసాయ కళాశాలలు, అనుబంధ విభాగాలు, వ్యవసాయ కంపెనీలు, కేవీకేలో పని చేస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థులను గుర్తించి అవార్డులను అందిస్తుందని తెలిపారు. ఈ సంవత్సరం ఉత్తమ శాస్త్రవేత్త విభాగంలో పశువైద్య విస్తరణ నిపుణులుగా ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీల్లో మేడ్చల్‌లోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్-దూలపల్లిలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకుంటారని తెలిపారు.

### దుకాణాల్లో అటవీ అధికారుల తనిఖీలు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

**మంచిర్యాలక్రైం:** జిల్లా కేంద్రం మంచిర్యాలలో గాలిపటాలు విక్రయించే దుకాణాల్లో అటవీశాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చైనా మాంజా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రేపతిరెడ్డి మాట్లాడుతూ చైనా మాంజా విక్రయంచిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చైనా మాంజా వినియోగించినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రాజశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

# పిండివంటలు రెడీ



పిండివంటలు చేస్తున్న నిర్వాహకులు

- స్వగృహ ఫుడ్స్‌కు పెరిగిన డిమాండ్
- నిర్మల్, మంచిర్యాల నుంచి విదేశాలకు ఎగుమతి

**నిర్మల్‌టౌన్/మంచిర్యాలటౌన్:** ఇళ్లలో సంక్రాంతి సందడి మొదలైంది. ఇంటిల్లిపాది ఇప్పటికే పిండి వంటల తయారీలో నిమగ్నమయ్యారు. ఇళ్లల్లో పిండివంటలు చేసుకోలేని వాళ్లు స్వగృహ ఫుడ్స్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా నిర్వాహకులు ఆర్డర్లపై నోరూరించే రకారకాల పిండివంటలు చేసి ఇస్తున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలనీలోని శ్రీగాయత్రి స్వగృహ ఫుడ్స్ వారు విదేశాలకూ పిండివంటలు ఎగుమతి చేస్తున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 1నుంచి రోజుకు సుమారు 70 కిలోల చకినాలను స్టాల్ వద్ద రిటైల్‌గా విక్రయిస్తున్నారు. సుమారు 300 క్వింటాళ్ల చకినాలతోపాటు వివిధ పిండి వంటకాలకు ఆర్డర్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. 20 రకాల పిండివంటలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఇక్కడ చకినాలు, గారెలు, కారప్పూస, బూరెలు, జంతికలు, అరిసెలు, చేగోడీలు, మురుకులు తదితర పిండి వంటలు లభిస్తాయి. ఐదేళ్లుగా పిండివంటలు తయారు చేసి విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కిలోకు రూ.280 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నారు.

- మంచిర్యాలలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు ఆర్డర్‌పై పిండివంటలు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. మార్కండేయ గుడి, రాంనగర్ దగ్గర నివసిస్తున్న మహిళా సంఘ సభ్యురాలు సాయిని అనితసాయిరాం రకరకాల పిండి వంటలను ఆర్డర్‌పై చేస్తోంది. విదేశాల్లో ఉంటున్న వారికి కొరియర్ ద్వారా పార్సిల్ చేసి పంపిస్తున్నారు. పిండి వంటల్లో ఏది చేసినా కిలోకు రూ.350 వరకు చార్జి చేస్తుండగా, చకినాలు, గారెలు, అరిశెలు, కారపూస, మురుకులు, కార బూంది, అటుకులు చుడువ, చెకోడీలు, బూందీ లడ్డు, రవ్వ లడ్డు, గవ్వలు, కరిజలు, నువ్వుల లడ్డు, పల్లీల లడ్డు, బక్షాలు వంటివి చేస్తున్నారు. విదేశాలకు పంపించేందుకు కిలోకు రూ.750 ఆపైన ఖర్చు అవుతుందని, ఎక్కువ మొత్తంలో పంపితే కిలోకు రూ.650 వరకు కొరియర్ చార్జి అవుతున్నట్లు వారు చెబుతున్నారు.



నిర్మల్: తయారు చేసి ఉంచిన అప్పడాలు, చకినాలు



మంచిర్యాలలో పిండి వంటలు చేస్తున్న మహిళలు



నిర్మల్‌లో తయారు చేసిన అరిసెలు

### నాణ్యతకు పెద్దపీట



**బెల్లంపల్లి:** పిండివంటలు తయారు చేయించడానికి శుచితోపాటు నాణ్యతకు పెద్దపీట వేస్తున్నాం. ఏ విషయంలోనూ రాజీపడం. అందువల్ల పిండి వంటలు ఎంతో రుచిగా ఉండి కొనుగోలు దారుల ఆదరాభిమానాలను చూర గొంటున్నాయి. పిండి వంటలను కిలోకు రూ.300 చొప్పున అమ్ముతున్నం. డ్రైఫ్రూట్స్ వినియోగించే పదార్థాల ధర కాస్త అధికంగా ఉంటుంది. మా వద్ద సగటున ముగ్గురు మహిళలకు అవసరాన్ని బట్టి కూలీ పనులు కల్పిస్తున్నాం.

– రాచర్ల రమేష్, సాయిదుర్గ హోంఫుడ్స్ నిర్వాహకుడు, బెల్లంపల్లి

### ఆర్డర్‌పై అన్ని రకాలు చేస్తాం



మా వద్ద అన్ని రకాల పిండి వంటలను ఆర్డర్‌పై తయారు చేసిస్తాం. కిలోకు రూ.350 వరకు చార్జి తీసుకుని, రకరకాల పిండి వంటకాలు, స్వీట్లు తయారు చేయడంతోపాటు, వెజ్, నాన్ వెజ్ పచ్చళ్లను చేసిస్తాం. విదేశాలకు పంపించేందుకు కిలోకు దాదాపుగా రూ.750 వరకు ఖర్చు అవుతుంది. ఎక్కువ మొత్తంలో ఆర్డర్ చేసి పంపిస్తే కిలోకు దాదాపుగా రూ.650కి పైగా తగ్గే అవకాశం ఉంటుంది. సంక్రాంతి పండుగకు ఎక్కువ మంది పిండి వంటలకు ఆర్డర్స్ ఇస్తున్నారు.

– సాయిని అనిత, తయారీదారు, మంచిర్యాల

### నాణ్యతే నడిపిస్తోంది





ఐదేళ్ల క్రితం స్వగృహఫుడ్స్ ఏర్పాటు చేశాం. రుచికరమైన, నాణ్యమైన పిండివంటలు తయారు చేసి ఇస్తున్నాం. శుభకార్యాలు, సభలు, సమావేశాలకు ప్రత్యేకంగా తయారు చేసి ఇస్తున్నాం. 12మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాం. – విజయలక్ష్మి, రమాదేవి, శ్రీగాయత్రిస్వగృహ ఫుడ్స్ నిర్వాహకులు

### ఇంట్లో చేసినట్లుగానే..



మార్కెట్లో లభించే హోమ్‌ఫుడ్స్ ఇంట్లో తయారు చేసినట్లుగా ఉంటున్నాయి. నాణ్యతతోపాటు రుచికరమైన పిండి వంటలు కావడంతో ఆర్డర్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నాం. ఇంట్లో చేయాలంటే ఎంతో శ్రమతో కూడుకున్నది. సమయం ఆదా అవుతుంది. – మగ్గిడి రమేశ్, నిర్మల్

### పిండి వంటలు నేర్చుకున్న..



**కుంటాల:** బీఈడీ పూర్తిచేసి ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తున్నా. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చా. అమ్మమ్మ, అమ్మ పండుగకు ప్రత్యేకంగా చకినాలను తయారు చేస్తారు. వారితో పిండివంటలు తయారీ నేర్చుకున్న. పిండి వంటల తయారీతో అందరం బిజీ బిజీగా ఉన్నాం. – భార్గవి, కుంటాల

# బెల్లంపల్లిలో వీగిన అవిశ్వాసం



అవిశ్వాస సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ సభ్యులు

**బెల్లంపల్లి:** ఎంతో ఉత్కంఠ రేపిన బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌లపై కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాసం వీగిపోయింది. అవిశ్వాస తీర్మానంపై ప్రిసైడింగ్ అధికారి, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ శుక్రవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ స మావేశం ఏర్పాటు చేశారు. మొదట చైర్‌పర్సన్ శ్వేతపై అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 20మంది కౌన్సిలర్లే హాజరయ్యారు. మొత్తం 33 మందికి గాను నిబంధనల ప్రకారం కోరం ఉండాలంటే 22 మంది హాజరు కావాల్సి ఉంటుంది. సభ్యుల అభ్యర్థన మేరకు ప్రిసైడింగ్ అధికారి సమావేశాన్ని మధ్యాహ్నం 2గంటలకు వాయిదా వేశారు. అప్పటికీ కోరం లేకపోవడంతో శ్వేతపై అవిశ్వాస తీర్మానం వీగిపోయింది.

**వైస్‌చైర్మన్‌పై..**

మున్సిపల్ వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై ఓటింగ్‌కు మధ్యాహ్నం 12.30గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి 20 మంది కౌన్సిలర్లు హాజరు కావడంతో కోరం లేక మధ్యాహ్నం 3.30గంటలకు ప్రిసైడింగ్ అధికారి వాయిదా వేశారు. రెండో దఫా స భ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో



వివరాలు ప్రకటిస్తున్న అధికారి హరికృష్ణ

అవిశ్వాస పరీక్ష వీగిపోయినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ తమ పదవుల్లో కొనసాగడానికి అర్ధంతరంగా ఏర్పడిన అడ్డంకులు తొలగిపోయాయి. కాగా, అవిశ్వాసం ప్రతిపాదించి శిబి రానికి వెళ్లిన 19మంది కౌన్సిలర్లు బస్సులో మున్సి పల్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రధాన గేట్ వద్ద సభ్యుల వివరాలు సరిచూసుకుని పోలీసులు లోనికి అనుమతించారు.

**కాంగ్రెస్ సభ్యుల గైర్హాజరు**

చైర్‌పర్సన్ శ్వేతతోపాటు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు 10మంది శిబిరానికి వెళ్లారు. శుక్రవారం సమావేశానికి గైర్హాజరయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వైస్ చెర్మన్ సుదర్శన్ కూడా హాజరు కాలేదు. అవిశ్వాసం నెగ్గడానికి, వీగిపోవడానికి కీలకంగా భావించిన బీజేపీ సభ్యురాలు అనితయాదవ్ కూడా పాల్గొనలేదు. ఈ లెక్కన 11మంది కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సభ్యులతో కలిపి మొత్తం 13మంది అవిశ్వాస పరీక్షకు దూరంగా ఉండడంతో వీగిపోయింది. కార్యాలయం వద్ద బెల్లంపల్లి రూరల్ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆర్.భుజంగరావు పాల్గొన్నారు

### మరో అవకాశం కల్పించాలి

అవిశ్వాసంపై ఓటింగ్‌కు మరో అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు దామెర శ్రీనివాస్, అఫ్సర్, అశోక్‌గౌడ్, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రెండో ధఫా సమావేశం నుంచి బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. అవిశ్వాస పరీక్ష నెగ్గడానికి 22 మంది సభ్యులు హాజరు కావాలని సమాచారం ఇవ్వలేదని, అవిశ్వాసంపై కోర్టుకు వెళ్తామని ప్రకటించారు.

### అందరి సహకారంతో అవిశ్వాసం నెగ్గాను

– చైర్‌పర్సన్ జక్కుల శ్వేత

**బెల్లంపల్లి:** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతుతో అవిశ్వాసాన్ని నెగ్గానని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. శుక్రవారం అవిశ్వాస సమావేశం ముగిసిన తర్వాత శిబిరంలో ఉన్న శ్వేత విలేకరులకు వీడియో ద్వారా అభిప్రాయాన్ని వెల్లడించారు. తనను పదవి నుంచి దింపడానికి అనేక కుట్రలు జరిగాయని తెలిపారు. సహకారం అందించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# నస్పూర్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



సమావేశంలో చేతులు పైకెత్తి అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లు

- 25మందిలో 19మంది కౌన్సిలర్ల మద్దతు
- చైర్మన్, బీఆర్ఎస్ సభ్యుల గైర్హాజరు

**నస్పూర్:** నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన తీర్మానం నెగ్గింది. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, మంచిర్యాల ఆర్డీవో రాములు, మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 17మంది కాంగ్రెస్, ఇద్దరు సీపీఐ కౌన్సిలర్లు హాజరయ్యారు. మొత్తం 25మంది కౌన్సిలర్లలో కోరం(2/3వంతుల మెజార్టీ) ఉండాలంటే 17మంది హాజరు కావాల్సి ఉండగా.. 19మంది హాజరయ్యారు. దీంతో సమావేశం కొనసాగించారు. అవిశ్వాస తీర్మానానికి సమ్మతి తెలియజేస్తూ అందరూ మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి రాములు ప్రకటించారు. కాగా, మున్సిపల్ వైస్‌చైర్మన్ తోట శ్రీనివాస్ ఇదివరకే తన పదవికి రాజీనామా చేయగా కలెక్టర్ ఆమోదించిన విషయం తెలిసిందే. చైర్మన్ ప్రభాకర్, మరో ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీఓ రాములు

**శిబిరం నుంచి నేరుగా..**

గత రెండ్రోజుల క్రితం 17మంది కౌన్సిలర్లు హైదరాబాద్ శిబిరానికి తరలివెళ్లిన విషయం తెలిసిందే. వారంతా శుక్రవారం నేరుగా సమావేశానికి హాజరయ్యారు.

**అవినీతి లేని పాలన అందిస్తాం**

బీఆర్ఎస్ అవినీతి పాలనకు వ్యతిరేకంగా చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గామని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు తెలిపారు. అవిశ్వాస తీర్మాన సమావేశం అనంతరం ఆయన సీపీఐ కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో అవినీతి లేని నీతివంతమైన పాలన అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గెల్లు రజిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులు కిటకిట

- సంక్రాంతి పండుగతో పెరిగిన రద్దీ
- ప్రయాణికులకు తప్పని అవస్థలు..



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

**మంచిర్యాలఅర్బన్:** సంక్రాంతి పండుగ వచ్చిందంటే నగరాలకు వెళ్లి చదవుకునే విద్యార్థులు, ఉద్యోగ రీత్యా వెళ్లిన వారంతా తిరిగి స్వగ్రామాలకు చేరుతున్నారు. శుక్రవారం ఆర్టీసీ బస్సులు, బస్‌స్టేషన్ కిటకిటలాడాయి. మహిళలకు ఉచిత ప్రయాణం అవకాశం ఉండగా.. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ప్రజలు మంచిర్యాల బస్టాండ్‌కు చేరుకోవడంతో ప్రాంగణాలు కిక్కిరిసాయి. సీట్ల కోసం బస్సులు రాగానే పరుగులు తీశారు. కొందరు కిటికీల్లో నుంచి దూకారు. ఆర్టీసీ డిపో పరిధిలో 138 బస్సులు ఉండగా 38 హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా రాకపోకలు సాగిస్తాయి. గురువారం నుంచి 20 ప్రత్యేక బస్సులు హైదరాబాద్‌కు నడిపిస్తున్నారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఏ బస్సు చూసినా రద్దీగా ఉంటోంది. సాధారణ రోజుల్లోనే పరిమితికి మించి బస్సుల్లో ప్రయాణం చేస్తుండగా పండుగ వేళ మరింతగా కిక్కిరిసిపోతున్నాయి.

**తప్పని పాట్లు..**

ఆసిఫాబాద్, చెన్నూర్ వైపు వెళ్లే బస్ పాయింట్ల వద్ద ప్రయాణికులు గంటలకొద్దీ వేచి చూశారు. బస్సులు సమయానికి రాకపోవడంతో మూడేసి గంటలు నిల్చోవాల్సి వచ్చింది. కూర్చోదామంటే సీట్లు సరిపోకపోవడంతో బస్సు కోసం నిల్చున్నారు. హైదరాబాద్, కరీంనగర్ నుంచి వచ్చిన విద్యార్థులు పలు ప్రాంతాలకు సరిపడా బస్సుల్లేక పడరానిపాట్లు పడ్డారు.

**ప్యాసింజర్ రైళ్ల రద్దుతో ఇక్కట్లు**

**మంచిర్యాల్యక్రైం:** సంక్రాంతి పండుగ సెలవుల్లో ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోంది. ఈ నెల 13నుంచి 16 వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో హైదరాబాద్, విజయవాడ దూర ప్రాంతాల్లోని విద్యార్థులు ఇళ్లకు చేరేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దూర ప్రాంతాల వారికి రైలు మార్గం సులువుగా ఉండడంతో చాలామంది రైల్లోనే ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు సాంకేతిక లోపాల వల్ల బల్లార్షా-సికింద్రాబాద్ మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లు రద్దు చేస్తూ ప్రకటించడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య ప్యాసింజర్ రైళ్ల రద్దుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆంధ్రా వైపు రెగ్యులర్‌గా నడిచే రైళ్లతోపాటు పండుగ సెలవుల్లో అదనంగా నడిపే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ ప్రాంత ఎంపీల నిర్లక్ష్యం వల్లే ప్రయాణికులకు ఈ దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రద్దయిన రైళ్లు ఇవే..

సికింద్రాబాద్-బల్లార్షాల మధ్య నడిచే భాగ్యనగర్, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, సింగరేణి ప్యాసింజర్, రామగిరి, బల్లార్షా ప్యాసింజర్, పుష్పుల్ రైళ్లను ఈ నెల 13వరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు రద్దు చేశారు. 14 నుంచైనా రైళ్లు పునః ప్రారంభం అవుతాయో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# యువత అన్ని రంగాల్లో ముందుండాలి

- అదనపు కలెక్టర్ మోతిలాల్

**మంచిర్యాలఅర్బన్:** యువత అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల సైన్స్ సెంటర్‌లో జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం, పర్యావరణ పరిరక్షణకు యువత నడుం బిగించాలని అన్నారు. 20 యువజన సంఘాల సభ్యులు, రక్తదానం, పర్యావరణ పరిరక్షణతోపాటు వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొనగా.. వారికి జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందజేశారు. చిన్నారి ఆకిరా జాను చేసిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. అంతకుముందు కాలేజీ రోడ్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బొబ్బిలి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

**తపస్ ఆధ్వర్యంలో..**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో స్థానిక కాలేజీరోడ్‌లో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్, నాయకులు శ్రీనివాస్ రాజేశ్వర్, శ్రీకాంత్, ప్రసాద్, నగేష్, సందీప్ పాల్గొన్నారు.



ప్రశంసపత్రాలు అందుకున్న యువతతో మోతీలాల్

### యువరాజ్యంకు పురస్కారం

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ యువరాజ్యం స్వచ్ఛంద సేవా సంస్థ సంస్థ గౌరవ సలహాదారుడు వొడ్నాల సత్యనారాయణ ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యాడు. పురస్కారాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, యువజన, క్రీడల శాఖ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నాడు.

## క్లుప్తంగా

### హత్యాయత్నం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: హత్యాయత్నం చేసిన కేసులో ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి యువరాజ్ తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ అధికారి సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ లైజనింగ్ అధికారి బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో హత్యాయత్నానికి యత్నించిన ఘటనలో తొగరం పరదేశిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల విచారణ అనంతరం సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కేసులో పోలీసులు సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్ ప్రవేశపెట్టిన సాక్షుల విచారణ అనంతరం కేసు పూర్వాపరాలు పరిశీలించిన అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి యువరాజు పరదేశికి మూడేళ్ల జైలు శిక్ష, సెక్షన్ 307 ఐపీసీ కింద రూ.3వేల జరిమానా విధించినట్లు బెజ్జూర్ ఎస్సై విక్రమ్ తెలిపారు.

### కోడి పందెం రాయుళ్ల పట్టివేత



పోలీసుల అదుపులో పందెం రాయుళ్లు

భీమిని: కన్నెపల్లి మండలంలోని సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా నలుగురు వ్యక్తులు ఆటోలో అనుమానాస్పదంగా పోలీసులకు కనిపించారు. ఆటోలో తనిఖీ చేయగా వారి వద్ద రెండు పందెం కోళ్లు, రూ.3,600 నగదు పట్టుబడగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. వారు వేమనపల్లి మండలం సూరారం గ్రామానికి పందెం ఆడడానికి వెళ్తున్నామని ఒప్పుకొన్నారు. వారి నుంచి రెండు పందెం కోళ్లు, రూ.3,600 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అనంతరం రెవెన్యూ అధికారుల ముందు బైండోవర్ చేశారు. పట్టుబడిన వారిలో వెంకటాపూర్‌కు చెందిన సోమశెట్టి కోటేశ్, పెద్దపల్లి కోటేశ్, మాదారానికి చెందిన సాయికృష్ణ, పూదరి ఆకాశ్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### బ్లడ్ డొనేషన్ ఆర్గనైజర్‌కు సన్మానం



రహీంను సన్మానిస్తున్న మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రానికి చెందిన రహీం బ్లడ్ ఆర్గనైజేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు రహీంను అడిషనల్ కలెక్టర్, జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రహీం ఎనిమిదేళ్లుగా రక్తదానం చేస్తూ, దాతలను ప్రోత్సహించేలా సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. అత్యవసర సమయాల్లో పేషెంట్లకు రక్తం అందించి ప్రాణాలు కాపాడారని కొనియాడారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, వయోజనవిద్య అధికారి పురుషోత్తం, నాయకుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ దుకాణాల్లో తనిఖీలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణం, మండలంలోని పలు రేషన్ షాపుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు చౌరస్తాలోని, కోసిని ఏరియాలోని షాపులు బినామీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి తొలగించారు. 6ఏ కేసు నమోదు చేసినట్లు అధికారి రాజ్‌కుమార్ తెలిపారు.



# పతంగుల పండుగ షురూ..

- సంక్రాంతివేళ గాలిపటాల జోరు
- ఉమ్మడి జిల్లాలో సందడే సందడి
- షాపుల్లో వివిధ ఆకృతుల్లో లభ్యం
- ఎగురవేసేటపుడు జెర భద్రం...
- అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలే..

నిర్మల్‌ఖిల్లా: ఉమ్మడి జిల్లాలో సంక్రాంతి సందడి మొదలైంది. విద్యార్థులకు పండుగ సెలవులు కూడా ప్రకటించారు. ఈ నెల 12నుంచి 18వ తేదీ వరకు సెలవులు ఇవ్వడంతో ఎక్కడెక్కడో చదువుకుంటున్న వారంతా ఇళ్లకు వచ్చేశారు. ఇక మార్కెట్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన పతంగులు కనువిందు చేస్తున్నాయి. చిన్నారులు పతంగుల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. ప్రతీ ఏడాది మాదిరిగానే పతంగుల జోరు కొనసాగుతున్నది. చిన్నా పెద్దా తేడా లేకుండా ఎగురవేసే అనేక రకాల గాలిపటాలతో నింగి అంతా బహుళవర్ణంతో తేజోమయమవుతోంది. సంక్రాంతి పండుగ మన ఇళ్లల్లో కాంతులు నింపాలి గాని విషాదాన్ని కాదు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ పతంగులు ఎగురవేసి పండుగ ఆనందంగా జరుపుకోవాలి. ఈ నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న కథనం..



జిల్లాకేంద్రంలో పతంగులు కొంటున్న బాలురు

**ఆనందం.. కారాదు విషాదం**

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చిన్నారుల నుంచి యువకుల వరకు అందరికీ గుర్తుకు వచ్చేది పతంగులు ఎగురవేయడం. అలాంటి పండుగ ఆనందంగా జరుపుకోవాలంటే చిన్నారులు తప్పకుండా జాగ్రత్తలు పాటించాల్సిందే. పండుగ మూడు రోజులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చిన్నారులు మూడు నుంచి ఐదు రోజుల పాటు పతంగులు ఎగురవేస్తుంటారు. వారు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాల బారిన పడే అవకాశాలున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పతంగులు ఎగురవేసే చిన్నారులు, యువకులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

**విపణిలో విభిన్న రంగుల్లో..**

గరుడ పక్షి, కప్ప, విమానం, చేప, పులి, ఫ్రీ ఫైర్, చోటా భీం, డోరా బుజ్జీ, అవేంజర్స్, చెప్మా చిత్రాలతో ఉన్న అనేక రకాల పతంగులను అమ్మకానికి పెట్టారు. దీంతో చిన్నారులు ఆసక్తిగా తిలకిస్తూ కొనుగోలు చేస్తున్నారు. దుకాణాదారులు రూ.5నుంచి రూ.300 విలువజేసే పతంగులను అందుబాటులో ఉంచారు. 300 నుంచి 400 మీటర్ల కాటన్ దారాన్ని రూ.20కి, నైలాన్ దారాన్ని రూ.50కి విక్రయిస్తున్నారు. కట్టెతో తయారు చేసిన చరకలు రూ.80 నుంచి రూ.200 వరకు ఉండగా, ప్లాస్టిక్ చరక రూ.40 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. కాగా, మార్కెట్‌లో అక్కడక్కడా నిషేధిత చైనా మాంజా అందుబాటులో ఉన్నట్లు సమాచారం.



గాలిపటాలు ఎగురవేస్తున్న యువకులు

**మాంజా వద్దే వద్దు**

నైలాన్, చైనీస్, గ్లాస్ కోటెడ్ ఉన్న కాటన్ మాంజాలపై నిషేధం కొనసాగుతోంది. పక్షులు, జంతువులకే కాదు మనుషులకూ ప్రమాదం ఉంటుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. పతంగులు ఎగురవేసేందుకు మాంజా కాకుండా సాధారణ దారాన్నే వినియోగించాలని వారు సూచిస్తున్నారు.

**మరిన్ని సూచనలు**

- పతంగులు డాబాలపై ఎగురవేయవద్దు.
- చుట్టూగోడలు లేని ఇండ్లపై అసలే వద్దు. తప్పనిసరైతే పెద్దల సమక్షంలో ఎగురవేయాలి.
- రద్దీ ప్రాంతాల్లో గాలిపటాలు ఎగురవేస్తే ప్రమాదాలు జరిగే అవకాశముంది.
- అతి ఎత్తైన ప్రదేశాల్లో పతంగులు ఎగురవేయడం మానుకోవాలి.
- గాలిపటాలు తెగిపోయినప్పుడు చిన్నారులు వాటికోసం పరుగులు తీసే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయి.
- పతంగులకు ఉపయోగించే దారం మాంజా సీసం, వివిధ రకాల కెమికల్స్‌తో తయారు చేయడంతో అవి చాకులా కోసుకునే అవకాశాలు ఎక్కువ.
- దారం తెగి విద్యుత్ తీగలకు గాని, చెట్టుకొమ్మలకు గాని చుట్టుకున్నప్పుడు వాటిని తీసే సాహసం చేయరాదు.
- దగ్గరలోని ఖాళీ ప్రదేశాలు, మైదానాలు ఎంచుకుని పతంగులను ఎగురవేస్తే పండుగ మరింత ఆనందంగా ఉంటుంది.
- పతంగులను ఎగురవేసేటప్పుడు చిన్నారులను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి.
- అత్యంత ప్రమాదకరమైన చైనా మాంజాను ఉపయోగించి పతంగులు ఎగురవేయరాదు.

**జాగ్రత్త వహించాలి**



సంక్రాంతి పండుగ నేపథ్యంలో సెలవులు రావడంతో పిల్లలు సంతోషంగా పతంగులు ఎగురవేస్తుంటారు. పెద్దవారు వెనకే ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి. గాలిపటాల దారం తెగి చెట్లు, విద్యుత్ స్తంభాలు, తీగలకు చిక్కుకున్నప్పుడు కొంతమంది కర్రలతో కొట్టడం లాంటివి చేస్తుంటారు. అలా చేయడం చాలా ప్రమాదకరం. పెద్ద బిల్డింగ్‌లపై పతంగులు ఎగురవేయడం.. దారం తెగిన పతంగులను పట్టుకునేందుకు పరిగెత్తడం లాంటివి చేయకుండా పిల్లలకు తగిన సూచనలివ్వాలి. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, వీధుల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, పాడుబడిన బావులు, పెద్ద గుంతల వద్ద ఎట్టి పరిస్థితిలో పతంగులు ఎగురవేయనివ్వకూడదు.

– జయవంత్‌రావు చౌహాన్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, నిర్మల్

**గిరాకీ బాగుంది**



మూడేండ్లుగా పతంగులు, దారాలు విక్రయిస్తున్న. ఈ సంవత్సరం పతంగుల కొనుగోళ్లు పెరిగాయి. రూ.60వేలతో పతంగుల స్టాల్ పెట్టాను. హైదరాబాద్ నుంచి పతంగులు తీసుకువచ్చి ఇక్కడ అమ్ముతున్నాను. మా దగ్గర రూ.5 నుంచి రూ.200 వరకు ధరల్లో పతంగులు ఉన్నాయి.

– కిరణ్, దుకాణాదారు, నిర్మల్

**పర్యవేక్షణ తప్పనిసరి**



చిన్నపిల్లలు గాలిపటాలు ఎగురవేసే క్రమంలో ఇంటి డాబాలపై ప్రమాదకరంగా పరుగెడుతుంటారు. దారం తెగిన పతంగులను అందుకునేందుకు పైకి చూసి పరిగెడతారు. ఇలాంటి క్రమంలో పడిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఇక మాంజా దారాలతో కూడా చేతివేళ్లు మెడ వంటి సున్నిత భాగాలు కోసుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని పర్యవేక్షిస్తూ పండుగ సెలవుల్ని ఆనందంగా గడపాలి.

– శశికాంత్, వైద్యుడు, నిర్మల్

**విద్యుత్‌శాఖ సూచనలు..**

- విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నచోట పతంగులు ఎగురవేయక పోవడమే శ్రేయస్కరం.
- విద్యుత్ వైర్లకు పతంగులు తగిలి చుట్టుకోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశముంది.
- విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు లేని ఖాళీ ప్రదేశాల్లో పతంగులు ఎగురవేయాలి.

## దరఖాస్తుల ఆహ్వానం

పాతమంచిర్యాల: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టీవోఎంసీవోఎం) తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా జపాన్, జర్మనీలో పని చేసేందుకు అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి కౌశిక్ వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగావకాశాల కోసం బీఎస్సీ నర్సింగ్/జీఎన్‌ఎం/ఏఎన్‌ఎం డిప్లొమా పూర్తి చేసిన 22–30 ఏళ్లవారు అర్హులని పేర్కొన్నారు. నెలకు రూ.1.5 లక్షల నుంచి రూ.1.8 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. జర్మనీలో నర్సింగ్ అప్రెంటీస్ ప్రోగ్రాం కోసం ఇంటర్‌లో 60 శాతం/అంతకంటే ఎక్కువ మార్కులు సాధించి 18–28 ఏళ్లవారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో నెలకు రూ.లక్ష స్టైఫండ్, ఉద్యోగ నియామకం తర్వాత నెలకు రూ.3లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. జపనీస్, జర్మన్ భాషలపై శిక్షణ, జపాన్, జర్మనీలో పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తి పరమైన నైపుణ్యాలు హైదరాబాద్‌లో అందించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయోడేటాను tomcom. germany@gmail.comకు మెయిల్ చేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8919047600, 63022924450, 9573945684 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## 15నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

పాతమంచిర్యాల: ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి పోటీలను ఆసిఫాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఈ నెల 15,16,17 తేదీల్లో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని పాత 10 జిల్లాల నుంచి 10 బాలికల జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని వివరించారు.

## గూడెంలో ఇరుముడి పూజలు



దీక్షాపరులకు ఇరుముడి కడుతున్న గురుస్వామి

దండేపల్లి: అభినవ శబరిమల స్థానిక శ్రీఅయ్యప్ప ఆలయంలో శుక్రవారం ఇరుముడి పూజలు ఘనంగా నిర్వహించారు. దీక్ష విరమణకు శబరిమల వెళ్లలేని భక్తులు ఆలయంలో ఇరుముడి కట్టుకుని పదునెట్టాంబడిద్వారా స్వామిని దర్శించుకుని దీక్ష విరమణ చేశారు. వీరికి గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు ఇరుముడి కట్టారు.

# ఇద్దరు గంజాయి విక్రేతలపై కేసు



పోలీసులు పట్టుకున్న గంజాయి

జన్నారం: గంజాయి విక్రయించడమే కాకుండా, మరో వ్యక్తిపై కోపంతో అతడి వాహనంలో గంజాయి ఉంచి కేసులో ఇరికించాలని చూసి తనే పోలీసులకు పట్టుబడ్డ ఘటన జన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం పవన్‌కళ్యాణ్ గంజాయి అమ్ముతున్నాడు. పాత కక్షలతో అదే గ్రామానికి చెందిన కాల్వ శివాజీ బైక్‌లో గంజాయి పెట్టాడు. అతడిని కేసులో ఇరికించాలని కుట్ర పన్నాడు. మిగతా గంజాయి విక్రయించేందుకు జన్నారం వెళ్తుండగా పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు రెండో ఎస్సై సర్కార్ పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన పవన్ కళ్యాణ్ వాహనం తనిఖీ చేస్తుండగా పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు అప్రమత్తమై పవన్‌కళ్యాణ్‌ను పట్టుకున్నారు. ఆయన నుంచి 96 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని విచారించారు. ఈ గంజాయిని కవ్వాల్ గ్రామానికి చెందిన రాహుల్ వద్ద కొన్నట్లు తెలిపాడు. ఈ మేరకు విచారణ జరిపి పవన్‌కళ్యాణ్, రాహుల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గంజాయితో పాటు నిందితుడిని, బైక్, ఫోన్‌ను అదుపులోకి తీసుకున్న రెండో ఎస్సై సర్కార్, హెడ్‌కానిస్టేబుల్ తుకారాం, కానిస్టేబుల్ భాస్కర్, రమేశ్, చంద్రమౌళిని ఎస్సై అభినందించారు.

# నూతన యంత్రాలు ఏర్పాటు చేయాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట, కాసిపేట 2గనుల్లో కాలం చెల్లిన యంత్రాలు తొలగించి నూతన ఎస్డీఎల్ యంత్రాలు తేవాలని కాసిపేట, కాసిపేట 2గనులపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం గనుల మేనేజర్లకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ మాట్లాడారు. కాలంచెల్లిన యంత్రాలతో ఆపరేటర్లు ఇబ్బందులు పడటంతో పాటు ఉత్పత్తికి విఘాతం కలుగుతోందని పేర్కొన్నారు. లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం లక్ష్య సాధన కోసం యంత్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్డీయల్ ఆపరేటర్లకు 10 ఏళ్లుగా పదోన్నతులు లేవని, వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. నెల రోజుల్లో యంత్రాలు తెప్పించకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. గని పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మినారాయణ, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి రాజేందర్, నాయకులు సంపత్, రవీందర్, రఘు, రాము, దామోదర్, ఎస్డీఎల్ ఆపరేటర్లు, కాసిపేట 2గనిపై కొండపల్లి నర్సయ్య, లింగమూర్తి, రత్నం రాజలింగు, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

# న్యాయవ్యవస్థలో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

పాతమంచిర్యాల: న్యాయ వ్యవస్థలో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని బీసీ ఐక్యవేదిక, అసంఘటిత రంగాల కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద ముఖానికి నల్ల రిబ్బన్లు కట్టుకుని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ జనాభాలో 60 శాతం బీసీలుంటే న్యాయ వ్యవస్థలో రెండు శాతం మాత్రమే ఉన్నారని తెలిపారు. ఉదాహరణకు 2018 నుంచి ఇప్పటి వరకు 604మంది న్యాయమూర్తులను నియమిస్తే అందులో 458 మంది అగ్రకులాలకు చెందిన వారే ఉన్నారని పేర్కొన్నారు. 304 మంది న్యాయమూర్తులుగా బీసీలు ఉండాల్సిన స్థానంలో 72 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా న్యాయ వ్యవస్థలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్, అసంఘటిత రంగ కార్మిక సంఘం నాయకుడు జైపాల్‌సింగ్, బీసీ సంఘాల నాయకులు శ్రీపతి రాములు, బోడంకి కుమార్, కర్రె లచ్చన్న, కట్కూరి శ్రీనివాస్, శేఖర్, మగ్గిడి రాజశేఖర్, మహేందర్, చంద్రమౌళి, రాజేశం, భిక్షపతి తదితరులున్నారు.

## పాముకాటుతో ఎద్దు మృతి



పాముకాటుతో మృతి చెందిన ఎద్దు

జైనూర్: మండలంలోని గూడమామడ గ్రామానికి చెందిన రైతు కుడ్మేత మోహపత్‌రావుకు చెందిన ఎద్దు శుక్రవారం పాముకాటుతో మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని సర్పంచ్ కుమ్ర కేశవరావు తెలిపారు.

## పాముకాటుతో బాలిక మృతి

- బెడ్‌పై సెల్‌ఫోన్‌తో ఆడుకుంటుండగా కాటు వేసిన విషసర్పం



బావునె కల్పన (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): బడికి సెలవులు రావడంతో ఇంట్లో ఫోన్‌తో ఆడుకుంటున్న పదేళ్ల బాలికకు పాముకాటుతో నూరేళ్లు నిండాయి. పాముకాటును గుర్తించడం ఆలస్యం కావడంతో ప్రాణాలు కోల్పోయింది. ఈ విషాదకర ఘటన శుక్రవారం కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండల కేంద్రంలోని మజీద్‌వాడలో నివాసం ఉంటున్న బావునె సునీత, విలాస్ దంపతులకు కుమారుడు, కుమార్తె కల్పన(10) ఉన్నారు. కల్పన స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. శుక్రవారం విలాస్ చౌపన్‌గూడకు పని కోసం వెళ్లగా, తల్లితో కలిసి బాలిక ఇంట్లోనే ఉంది. బెడ్‌పై పడుకుని ఇంటి గోడ సెల్పులపై కాళ్లు పెట్టి సెల్‌ఫోన్‌తో ఆడుకుంటుండగా మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఓ విషసర్పం కల్పన ఎడమ కాలు బొటన వేలి కింద కాటు వేసింది. దీంతో కాలును గట్టిగా కదపడంతో బెడ్ బలంగా తాకి తీవ్ర రక్తస్రావమైంది. ఇంట్లోనే ఉన్న తల్లి గమనించినా కాలుపై రక్తం ఎక్కువగా ఉండటంతో పాముకాటును పసిగట్టలేకపోయింది. ఆ తర్వాత పాముకాటు విషయం తెలుసుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆసిఫాబాద్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కల్పన తండ్రి విలాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఐకే1ఏ, ఐకే–ఓసీలో భరోసా యాత్ర



మాట్లాడుతున్న శంకర్‌రావు

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ, ఐకే–ఓసీపీపై శుక్రవారం ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో భరోసా యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఐఎన్టీయూసీ ఓడిపోయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని పేర్కొన్నారు. అనుకోకుండా మైన్‌లో ప్రమాదం జరిగితే చికిత్స కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా కార్మికులకు సెంటర్ పాయింట్ అయిన గోదావరిఖనిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. కార్మికుడి సొంతింటి కల నెరవేర్చడం, కార్మిక వాడల్లో స్వచ్ఛమైన గోదావరి నీటిని సరఫరా చేయడం, కొత్త భూగర్భ గనులను తెప్పించడం, ఐటీ పన్నుల మినహాయింపు తదితర హామీల అమలుకు కృషి చేస్తామని తెలిపారు. ఐఎన్టీయూసీ జాతీయ సమితి సభ్యుడు సీహెచ్ భీమ్‌రావ్, నాయకులు శ్రీనివాస్, వెంకటస్వామి, పేరం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె విరమించిన కార్మికులు



నాయకులతో మాట్లాడుతున్న రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): కొద్దిరోజులుగా వేతనాల పెంపు కోసం కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికులు సమ్మె చేస్తుండగా శుక్రవారం యూనియన్ నాయకులతో యాజమాన్యం జరిపిన చర్చలు సఫలం కావటంతో సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో కోల్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ నాయకులతో ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్, ఇతర అధికారులు కోల్ ట్రాన్స్‌పోర్టు సంస్థలు చర్చలు జరిపి వేతనాల పెరుగుదలకు అంగీకరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడారు. యాజమాన్యంతో జరిపిన చర్చలు సఫలం కావటం సంతోషకరమన్నారు. ప్రస్తుతం ఉన్న వేతనాల కంటే రూ.2వేలు అధికంగా చెల్లించేందుకు ట్రాన్స్‌పోర్టు సంస్థలు అంగీకరించాయని పేర్కొన్నారు. ప్రతినెలా 10వ తేదీలోపు వేతనాల అందించటంతో పాటు దహన సంస్కారాల కోసం రూ.50వేలు అందించేందుకు అంగీకరించాయని తెలిపారు. కార్మికులు రవాణా సౌకర్యం, తదితర హక్కులు సాధించుకున్నట్లు పేర్కొన్నారు. సమ్మె సందర్భంగా కనీస వేతనాలతో పాటు 14 డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచగా చర్చల్లో కొన్ని సాధించుకున్నామని తెలిపారు. సమ్మెకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. చర్చల్లో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, క్వాలిటీ మేనేజర్ రవి, ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ గోలేటి అధ్యక్షుడు స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి ఉపాధ్యక్షుడు లచ్చన్న, కార్యదర్శి రవిప్రసాద్‌గౌడ్, రాజ్‌కుమార్ ట్రాన్స్‌పోర్టు సంస్థ ప్రతినిధులు ప్రవీణ్‌రావు, జితేందర్, రెబ్బెన సీఐ నరేందర్, తిర్యాణి ఎస్సై రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక బృందాలను ఏర్పాటు చేయాలి



బలరాంనాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నస్పూర్: సింగరేణి వ్యాప్తంగా సాంస్కృతిక బృందాలను ఏర్పాటు చేయాలని సింగరేణి కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు సాధనవేణ ప్రభాకర్ కోరారు. శుక్రవారం ఆయన పలువురు ఐక్యవేదిక నాయకులతో కలిసి హైదరాబాద్‌లో సింగరేణి సీ అండ్ ఎండీ బలరాయంనాయక్‌ను కలిశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. తాము సింగరేణి సంస్థలో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తూనే సంస్థ నిర్వహించే రక్షణ వారోత్సవాలు, పర్యావరణం, తెలంగాణ అవతరణ, సింగరేణి ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొని కార్మికులను చైతన్యవంతులను చేస్తున్నామని తెలిపారు. స్పోర్ట్స్ విభాగానికి అందిస్తున్నట్లే కల్చరల్ విభాగానికి వాయిద్య పరికరాలు సమకూర్చాలని కోరారు. ఏరియాకు ఒక కళాబృందాన్ని ఏర్పాటు చేసి వివిధ గనులపై కార్మికులను చైతన్యవంతులను చేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అన్ని డివిజన్లలో కళాకారులకు ప్రాక్టీస్ కోసం ఆడిటోరియాలు కేటాయించాలని కోరారు. కార్యదర్శి పులిమల సతీశ్, శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు షేక్ తాజొద్దీన్, కార్యదర్శి రాజేశ్వర్‌రావు, సలహాదారులు గవ్వంపల్లి స్వామి, గజెల్లి రాజలింగు తదితరులు పాల్గొన్నారు.